# నీలాపనింద ★

రచన:
"ఓగిరాల కృష్ణ"

మొన్నీమధ్య విశాఖపట్నంవెళ్లి పనిచూసుకుని ఆ వేళరాత్రి మెయిలుకి మద్రాసు బయల్దేరేను. వాల్తేరుస్టేషనులో రైలెక్కబోతూంటే మా ఉప్పాయి కనిపించేడు ప్లాట్‌ఫారంమీద చేతిలో బరువుగావున్న సూట్‌కేసు కూడా కంపార్టుమెంట్‌లో పడెయ్యకుండా ఒరేయ్ ఉప్పాయ్! అని కేకేస్తూ వాడిదగ్గరకు పరుగెత్తేను, కొత్తచెప్పులు కరకరా కరిచేస్తున్నా గమనించకుండా. మరి ఉప్పాయ్ సందర్శనమంటే స్నేహమనే ఎడారిలో ఒయాసిస్‌లాంటిది.

ఒకటోక్లాసునుంచి ఆనర్సుదాకా కొట్టుకొచ్చిన జంట స్నేహితులలో మాదొకటి. ఒకే సంవత్సరం యిద్దరం లిటరేచరు ఆనర్సుపాసై కథాసాహిత్యంలో పడ్డాం. మాఉప్పాయి (అటెండెన్సు రిజిస్టరులో వాడిపేరు ఉపయోగారావు) ఫాషన్‌కోసం కలంపేరుగా 'సాల్టేంద్ర శర్మ' అని 'ఉప్పశ్రీ' అని కథలు వ్రాశాడు. 'గండుపిల్లులు' (రాజకీయ వ్యంగ్యరచన) 'బుడంపాడు రోడ్డు' (డిటెక్టివ్ కథ) 'ముదకష్టపు రోగాలు' (ఆ మధ్య మాఉప్పాయికి డబుల్‌టైఫాయిడు వచ్చింది. అందువల్ల రచయిత పర్సనాలిటీ ఉన్న కథన్నమాట) వంటి ధరలు పత్రికల్లో పడటం చూసే ఉంటారు.

ఉప్పాయికి లెక్చరరు ఉద్యోగమయింది. మా స్నేహానికి ముసలంపుట్టింది. వాడి అభివృద్ధి ఎంతగావో కాంక్షించినా ఉద్యోగరీత్యా వాడు దూరపుపూరు వెళ్తోంటే కొంత దిగులు పడ్డాను. ఈర్ష్యమాత్రం లేదు.

మిత్రుడు వెళ్ళిపోయినందుకు కూర్చుని దుఃఖించే పనిలేకుండా, నాకో మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగమొచ్చింది. అంతే, అప్పటిదాకా అన్నదమ్ముల్లా, ఆప్తమిత్రుల్లా పెరిగిన నేనూ మా ఉప్పాయి ఎవరిదోవనవాళ్లం విడిపోయాం. ఈ వియోగం మాకెంతో బాధాకరంగా వుండేది.

నాకు సరిగా గుర్తులేదు. మూడేళ్లపైనే అయిందనుకుంటాను మేమిద్దరం కలుసుకుని. మళ్లా అదృష్టంకొద్దీ వాల్తేరుస్టేషనులో మా ఉప్పాయిని చూచేసరికి నా కెక్కడలేని ఆనందం ముంచుకొచ్చింది. ఆ సంతోషంలో మానోట మాటలురాక గొంతుక తడి ఆరిపోయింది. కుశలప్రశ్నలు వేసుకోవడం అయిపోయింది. ఉప్పాయిగూడ మద్రాసు వస్తున్నాట్ట, ఏదో పనిమీద. వాడు నాకీ విషయం చెప్పేసరికి నేనన్నాను "ఒరేయ్! నిజంగా యివాళ మనం కలుసుకోవడం ఇద్దరం మద్రాసుదాకా ఒకేరైల్లో బయల్దేరివెళ్లడం, అచ్చం ఒక కథలో జరిగినట్లుగా వుందిరా" అని. కానీ పవిత్రప్రేమకు అన్నీ విఘ్నాలే అన్నట్లు-వాడిచేతులో థర్డ్‌క్లాసు టిక్కెట్టుంది. నేనేమో సెకండుక్లాసు టిక్కెట్టుకొని కూర్చున్నాను. ఇది నాకేం నచ్చలేదు. వెంటనే వాడి టిక్కెట్టు సెకండుక్లాసుకిమార్చి తీసుకొచ్చాను.

ఈలోపల నా మిత్రుడు ఏమి ఆలోచిస్తూ కూర్చున్నాడో తెలియదు, నేను తిరిగి రావడంతోటే కొత్తరకం డైలాగులు వల్లించడం మొదలుపెట్టేడు "ఒరే స్టోరీరైటర్, ఒరే బ్రదర్, నువ్వు నాకోసహాయం చెయ్యాలిరా. ఒకవిధంగా నువ్వు అదృష్టవంతుడివి. ఫ్రీ బర్డ్‌వి. చక్కగా అవూరనక యీవూరనక తెగ తిరుగుతావు. నీ ఉద్యోగంతీరే అదనుకో. ఎన్నెన్నో వింతలు, విశేషాలు చూస్తావు నాకెలా వస్తుంది ఆ తిరుగుడుచెప్పు?...."

"నీ కిప్పుడొచ్చిన దిగులేమిటి? నీకు చేయాల్సిన సహాయమేమిటి?" అన్నాను వాడు చెప్పినదాంట్లో సందర్భం అర్థంగాక.

"ఏంలేదురా! మొదట్లో ఆవూపులో ఎవేవో వ్రాశానా కథలు. అంతే, ఇక సంసారం నెత్తినబడ్డనుంచి దానికో ఫుల్‌స్టాప్ పడింది. ఏదిరాద్దామన్నా ఏదీ తోచడంలేదు సరైనది. ఇటు తీరుబడి, అటు యితివృత్తాలు గూడా దొరకడంలేదు. దేశం తిరిగేవాడూ, విశ్రాంతి ఉన్నవాడు నిత్యం మనకళ్లయెదుట జరిగే విషయాలు, జాగ్రత్తగా పరిశీలించిచూస్తే సరి. పోలేదూ! ఏమంటావ్" అన్నాడుప్పాయి నాకంతా అర్థమవుతోందన్న దురభిప్రాయంతో.

"ఓరి నీ తెలుగు మండిపోను! నాకొక్క వాక్యం అర్థంకావటం లేదు. కాస్త 'మేడ్ యీజీ'చేసి చెప్పవదూ అసలు విషయమేమిటో అనవసరంగా సస్పెన్సులో పడగొట్టకుండా"

"ఏమిలేదురా! నాకు జీవితంలో చక్కని అవకాశాలు లేకపోవడమే. తిరిగినవారికే వింతలు విశేషాలు గోచరించేది. మాలాటి కూపస్థమండూకాలకి కాదు. నీవు వేలకువేలు చూసుంటావు. అన్నాడుప్పాయి.

"ఈమధ్య నేమైనా కొత్తరచనలేవైనా సాగిస్తున్నావా? ఏమిటి ఎవరికీ అర్థంకాని యీ తెలుగు ప్రోజ్ ఒకటి డెవలప్ చేస్తున్నావు. లేదా మైండేమైనా కొంచెం ప్రక్కకు జరిగి ఉంటుందా? ఇదివర కెప్పుడూలేదే! నావల్ల నీకేదో సహాయం కావాలన్నావు. ఆసహాయాన్ని ఎక్కడో పూడ్చిపెట్టి దానిపైన ఏమిటీ కట్టడమంతా" అన్నాను.

"ఏమిటంటావా, పెద్ద యేమీలేదు. మనిద్దరం ఇలా కలుసుకోవటం అచ్చం ఒకకథలో జరిగినట్లుంది అని జ్ఞాపకం చేసినందుకు చాలా సంతోషం సన్నీ సంవత్సరం మా కాలేజీ మేగజైన్‌కి తెలుగుకి ఎడిటర్‌గావేశారు. ఈసారి ఓ మాంచికథ వ్రాసిద్దామనుకుంటున్నాను. ఆలోచిద్దునుగదా సరైనది దొరకటంలేదు. ఎప్పుడూ అటూ యిటూ తిరుగుతుంటావ్. అందుకని యేదైనా ఒక సంఘటన....ఒక విషయం....ఏం!" అని అడిగేడు.

'ఓ ఎస్ దానికేం! వందలు చూపిస్తా వందలు. ఒక్కొక్కటి ఒక కథలో వ్రాయొచ్చు ఓపికుండాలిగాని' అన్నాను నేను.

'అయితే సరైనది ఒక్కటి చూపిస్తూ' అన్నాడుప్పాయి.

"ముందువెళ్లి (ఆదివారం) పేపరుపట్రా, ఇవాళ ప్రొద్దున్నుంచి పేపరు చూడలేదు అని పావలా కాసిచ్చి మాఉప్పాయిని పంపించేను.

ఓ అయిదు నిముషాల్లో మా ఉప్పాయి ఆదివారం తెలుగుపేపరు చేత్తోపట్టుకుని, దిగులుతో నాదగ్గఱకొచ్చిపడ్డాడు.

"ఏమిటా వాలకం .... అట్లా ఉన్నావేం?" అనడిగేను.

"ఒరేయ్! యివాళ మనం బయల్దేరిన వేళా విశేషం మంచిది కాదురా నాయినా. అమావాస్య, మంగళవారంకంటే కనాకష్టమైనదిగా కనపడుతోంది. అందుకుతోడు వర్జ్యం గూడ చూడకుండా బయల్దేరేమేమో....తగిన శాస్తి జరిగిందంటే" సస్పెన్సు తట్టుకోలేక 'ఏమిటేమిటి? ఏమైంది?' అనడిగేను.

"ఏముంది షేమ్‌రా! డబల్‌షేమ్! నేను అవమానంతో తరువాత తీసుకుంటాను. ముందేమయిందంటే నేను పేపరు కోసం వెళ్లేను. అప్పటికే ఆ పేపరువాడిచుట్టూ ఓ పాతికమంది మూగివున్నారు. నేను వాళ్లలో జొరబడి పేపరు తీసుకుని ఓ పెద్దమనిషి బూట్‌కాలుక్రిందున్న నా కాలు గమనించి, ఇవతలకు తీసుకుని ఒక్క విసురున బయట పడ్డాను. ఆ పడేపడటంలో అక్కడొక ముప్పైయేళ్ల లిల్లీ....లిల్లీయేమిటి నాపిండాకూడు.... ఆదొక రావణాసురుని చెల్లి .... కాల్‌టాక్స్ డ్రమ్ము....ఓ పెద్ద రమ్మా అనుకో—నిలబడి వుంది. నేను చూడలేదు. వెళ్లి పొరపాటున ఆమె ఉత్తరార్థంమీద పడ్డాను. ఆ తాకిడికి ఆమె బొ....బొ....బొక్క బోర్లాపడబోయి తట్టుకుని మళ్లా నిలబడగలిగింది ఎంతో స్థిమితముగావున్న ఆ నడుములాంటిదాన్ని ఆధారం చేసికొని, పడటంలో నేను చాలా భాగం ఫోర్స్ తగ్గించుకున్నందువల్ల, ఎవరో వచ్చి ఆమెను గట్టిగా కౌగిలించుకునేందుకు ప్రయత్నం జరుపుతున్నారని ఆమె ఫీలయివుంటుంది.

వెంటనే గుడ్లెర్రజేసి జుట్టును కొంచెం పైకి జేగదోసుకుంటూ, యూ ఫూల్‌రోగ్ అని తిట్టింది. సంగతి తెలియకుండా అనేస్తోందని నేను తొందరపడిపోతూ గాభరాగా 'షటప్' అన్నాను దిస్ యీస్ నాన్సెన్స్' అని తోచి. ఆమె మహాకాళిలా ప్రళయభీకరమూర్తియై బుసకొడుతూ, ఇంగ్లీషు తిట్లన్నీ ఏరి యీ నా మందశరీరంమీద విసిరేసింది. 'సిగ్గులేదూ?' అన్నది. అంతదాకా దీనికి తెలుగ్గూడా వచ్చునన్నసంగతి నాకు తెలియదు. 'కళ్ళు కనపడటంలేదా?' అంది. బాబోయ్!

ఇది పెద్ద రాద్ధాంతమయేటట్లున్నదని గమనించి 'మీరు విషయం తెలుసుకోకుండా నోటికొచ్చినట్లు అనేస్తున్నారు. మీరు నా సిస్టర్ లాంటివారు, నేను పడిన కారణమిది' అని చెప్పేను. అది వింటేనా! దాని ధోరణి దానికి.

దానిమెడలో మంగళసూత్రం నాకు చూచాయగా కనపడినందున, యీామె మొగుడు చుట్టుప్రక్కల ఎక్కడైనా ఉన్నాడేమో కొంపదీసి వచ్చెనా నా వీపంతా చదునుచేసి, వెన్నెముక బయటికితీసి చూపించేలా గున్నాడని భయపడి – దూరదృష్టికలవాణ్ణాయెను మరి– యిటు పరుగెట్టుకొచ్చేను." అని ఉప్పాయి ఆయాసంతో మాట్లాడేడు.

అయ్యో! ఎంతకష్టమొచ్చిందిరా నీకు" అని ఓదార్చి—ఆఁ....చూశావా మరి.... ఇందాక కథకి యితివృత్తం కావాలన్నావ్, ఇంకేం. ఇది రాసెయ్యరా మాట్లాడకుండా. 'జంక్షన్‌లో శంఖిణి' దీని హెడ్డింగ్'' అన్నాను.

నే నీమాట లనేసరికి, అసలే పరాభవంతో మగ్గిపోతున్న మా ఉప్పాయికి మొండికత్తితో ముక్కు, చెవులు తెగ్గొట్టినట్లయింది.

పోరా వెధవా! వేళాకోళం నువ్వూను. 'అని విసుక్కుని లోపలికెక్కి కూర్చున్నాడు మాట్లాడకుండా.

ఓ పదినిముషాలపాటు కబుర్లు చెప్పుకునేంతవరకు వాడు మామూలుమనిషి కాలేదు. ఆ రాత్రి తొమ్మిదిన్నరగంటలకు వాల్తేరు వదలింది. రైల్లో నిద్రపోవటం మాకిష్టంలేదు. ఒకళ్లపక్కనే ఒకళ్లం కూర్చుని, బహు చిన్నగా మాట్లాడుకుంటున్నాం కంపార్టుమెంటులో అంతా పెద్దమనుషులే ఎక్కేరు. నెమ్మదిగా నేను పేపరుతీసి ముందు వారఫలాలు మా యిద్దరికీ ఒకేనక్షత్రం చదివేను. 'మిత్రుల సమాగమం, దూరప్రయాణం, నీలాపనిందలు' అని ఉంది. అచ్చం చెప్పినట్లుగానే జరిగింది.

ఏర్పడ్డ నిరాశకి దారుణంగా గురికాని నేను, నా నోటిని వాడి చెవిదగ్గరకిపోనిచ్చి అన్నాను. మనకు ఎదురుగుండా కూర్చున్న లాల్చీవాలాకు కుడిపక్క కూర్చున్న మూడో అయన్ని చూడు. ఛా! అట్లా స్ట్రెయిట్‌గా చూస్తావేఁరా? కాస్త తొంగి తొంగి చూడు. చూసిచూడనట్లు చూడు. ఆయనిందాకటి నుంచి ఎందుకో మనని ఒక కంట కనిపెడుతున్నాడు. చూశావా అప్పుడే ఆయన మన వంక ఏదో అనుమానంగా తొంగిచూస్తున్నాడు. ఇందాకటినుంచీ ఆయనొక వారపత్రికాసంపాదకుడని తేటతెల్లమగుచున్నది కదా. కాని ఆయనెంత దిగులుగా వున్నాడో చూడు.

'అవును' అని వొప్పుకున్నాడుప్పాయి.

'ఎందుకంటావ్'

'పత్రికసేల్సు పడిపోయుంటాయి'

'ఛీ! ఛీ!! అలాంటిదేమైనావుంటే ఆత్రాజడీ ఫేస్ ఆఫీసులోపెట్టాడు. కాని ఇక్కడపెట్టడు.

'అయితే ఏమయ్యుంటుందంటావ్?'

'చిన్నగా మాట్లాడు ఏమిటేమిటిరా ? థింక్ చెయ్యాలి. ఫామిలీవర్రీస్, వాళ్లబ్బాయిపరీక్ష పోయుంటుంది. పెద్దమ్మాయి పెళ్లైయుండదు. ఇంకేం దంచిపారెయ్యి కథ! 'పాపం ఒక పేరెంట్' అని పేరు తగిలించు కథకేముంది. నీ చెవిని నా నోటికి కొద్దిగ దగ్గరసాజరుపు.... ఆఁ....చాలు....ఇక విను. ఒకాయన సంతోషంగా విశాఖపట్నంలో రైలెక్కేడు మద్రాసు పోయేందుకు. ట్రెయిన్‌లో కబుర్లు సందర్భముగా తన ఫామిలీవిషయం ప్రస్తావనొచ్చి మనిషి చాల వర్రీఅయాడు. ఈయనప్రక్కన కూర్చున్నాయన ఒక చక్కని సంబంధం (వాళ్లమ్మాయికిలే) చెప్పేడు. ఈ యొక్క పేరెంటు తనయొక్క కూతురుయొక్క పెళ్లి త్వరలో జరుగబోతున్నందుకు మళ్లీ ఆనందంతో దిగిపోయాడు అనేయ్. ఇంకా కావలిస్తే ఆ సంబరంలో టిక్కెట్టుగూడ పారేసుకున్నాడను విషాదసుఖంత మవుతుంది' అన్నాను. మావాడు నవ్వుముఖంతో వింటున్నందుకు బహుశ యిది తప్పక నచ్చే వుంటుందని.

'ఒరేయ్ కాస్త నోరు తెరుస్తా' అనడిగేడు జాలిగా, హఠాత్తుగా అర్థంకాకుండా.

'ఎందుకు'

'కొంచెం గుడ్డలు కుక్కాలిగాని'

'అంతేనా! యింకా మన్నుతిన్నాననుకుంటున్నావేమో!'

'మరి లేకపోతే యేమిటి! తెలివితేటలు, జ్ఞాపకశక్తి వృద్ధవుతున్నాయి! మన క్లాస్‌మేట్ రంగతాయారు వాళ్లబాబులు విషయంలో ఇలాటికథ నేనే గదట్రా వ్రాసింది! పెద్దచెప్పొచ్చావ్. ఇక చాల్లే నువ్వు నాకేం చెప్పక్కరలేదు! నేనేదైనా చూసివ్రాసుకుంటాలే! చూడబోతే నన్ను యేడిపిస్తున్నట్టుందిగాని'అన్నాడు నా తాపత్రయమంతా వృధాచేస్తూ!

మమ్మల్ని రైలు మద్రాసు లాక్కొచ్చి పడేసింది! మా పెట్టెలో వాళ్ళు చాలామంది మద్రాసులోనే దిగిపోయారు ముఖ్యంగా ఆ ఎడిటరు, అప్పటికి రాత్రి ఏడుగంటలయింది!

మేము రైలుదిగి ప్లాట్‌ఫారంమీద నడుస్తుండగా న్యూస్‌పేపర్లమ్మే కుర్రాడు కనిపించేడు! వాడిని చూడగానే నాకు పేపరుకొందామని బుద్ధిపుట్టలేదు సరికదా! నిన్నరాత్రి నేను చదివిన వారఫలాలతాలూకు అపనింద అన్న విషయం జ్ఞాపకానికొచ్చి నన్ను గజిబిజిచేసి వదిలిపెట్టింది.

ఆ మర్నాడు రాత్రే జరిగింది ప్రళయమంతా.

నేనూ ఉప్పాయి కలసి ఉడిపిహోటల్లో భోంచేసి, కిల్లీవేసుకుని ఆపక్కనేవున్న పత్రికలమ్మేచోటుకి వెళ్లేము, వారపత్రిక ఒకటి కొందామని. మా ఉప్పాయే డబ్బిచ్చి వారపత్రికొటి కొన్నాడు. నేను గబుక్కున తీసుకున్నాను ముఖ్యంగా హెడ్డింగులు చూసేటందుకు, మా ఉప్పాయి మిగతా మేగజైన్లమీదున్న ముఖచిత్రాలు తీక్షణంగా వీక్షిస్తున్నాడు.

నేను హెడ్డింగులు చూస్తుండగా మొట్టమొదటికథ పేరు 'సుందోపసుందులు' అని ఉంది. ఇదేమిహెడ్డింగయ్యోయ్ అనుకుంటూనే ఎవరు వ్రాశారోనని చూశాను. అక్కడ వ్రాసినాయిన పేరులేరు. ఆ కథ చివ్వర చూద్దునుగదా—ఎడిటర్ అని ఉంది. మళ్లీ కథ మొదటికొచ్చి మొదటివాక్యం చదివేను.

"వాల్తేరునుండి మొన్న నవంబరు ఒకటో తారీకున మెయిల్లో నేను మద్రాసువస్తున్నాను.

భలే, భలే, అది మాట్రయినే! కొంపదీసి మా కెదురుగుండా కూర్చున్న ఎడిటర్ కాదు కదా.... ఆఁ!

రెండోవాక్యం—"వాల్తేరులో మా సెకండ్ క్లాసుపెట్టెలో ఇద్దరు వింతమనుషులు ఎక్కేరు నీట్‌గా డ్రస్‌చేసుకుని, నేను ఊహించింది నిజమే అయితే వీళ్ళిద్దరూ విశాఖపట్నం పిచ్చాసుపత్రినుండి తప్పించుకొని వచ్చి ఉంటారు"

మూడోవాక్యం—"వాళ్ల దొంగచూపులూ గుసగుసలు చూస్తే పూర్వాశ్రమంలో వీళ్లిద్దరూ జేబుదొంగలై వుంటారని తోచింది"

అయ్యో ఖర్మమా! హే శ్రీ రామచంద్రా! ఇలా చేశావేమిటి స్వామీ! మేమేంచేశామని మాకీ అపనింద.

నాలుగో వాక్యం— "ఆ కూర్చున్నవాళ్ళు కూర్చోక, అందులో ఒకడు పేపరు తెమ్మని డబ్బులిచ్చి పాపం రెండోవాడిని పంపేటప్పటికి...." ఇంక చదువలేకపోయాను. పదంతస్తులమేడమించి కళ్లుతిరిగి కిందపడ్డట్టయింది. జయ్‌మని క్రిందకు జారినట్లనిపించింది. వళ్లంతా చిటచిటలాడిపోయింది. మామీద కథ వ్రాస్తాడా యీ ఎడిటరు! వీడికి నూరేళ్లూ నిండిపోను. అయినా యిదేంకథండి! పాడు కథ అనుకున్నాను. అమ్మమ్మా యీ కథ ఉప్పాయి ఎంతమాత్రం చూడకూడదు. చూస్తే విరుచుకుని నామీద పడతాడు. ఈ అపనింద లన్నిటికి నేనే కారణమని, మరుక్షణంలోనే ముఖచిత్రాలమీదున్న మా ఉప్పాయిదృష్టిని నావైపు మరల్చుకుని 'ఒరేయ్ ఉప్పాయి! యీపత్రి కొద్దులే. ఇంకేదైనా తీసుకోమన్నాను, మాటలు తడబడగా. ఏం! అలా అన్నావు అన్నాడుప్పాయి. నాకు వేరే ఏమీ పాలుపోయిందికాదు. ఆఁ! ఏంలేదు. ఇది నేను నిన్ననే కొనేశాను. నా ఫ్రండ్‌కూడ యింకోటికొన్నాడు. నా రూములో రెండు కాపీలున్నాయి." అన్నాను నాతెలివితేట లుపయోగిస్తూ. సరేనని ఉప్పాయి దాన్నిచ్చేసి. ఇంకో పత్రిక కొన్నాడు. ఇద్దరం అక్కడనుంచి బయల్దేరేము, పుస్తకం చేత్తోపట్టుకుని వాడు, తలకాయ చేత్తోపట్టుకుని నేను. ★